Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 154 | Thusday : 29.05.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :154 | గురువారం : 29.05.2025 | వెల : 3 | పేజీలు : 4






# కార్యకర్తలే బలం,బలగం

**అధ్యక్షునిగా మరోసారి ఎన్నికైన చంద్రబాబు**
**నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ**
**తప్పు చేసిప వారిని వదిలేది లేదని హెచ్చరిక**

**(చిత్తూరు ఎక్స్‌ప్రెస్, కడప) :**

కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం, బలగం అని ముఖ్య మంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. కడపలో జరుగుతన్న మహానాడులో ఆయన మరోసారి జాతీయ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మాట్లాడుతూ తనకు హైకమాండ్ కార్యకర్తలేనని, వారు చూపిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తప్పు చేసిన వారినెవరినీ వదిలిపెట్టేది లేదని, వారిపట్ల చండశాసనుడిలా వ్యవహరిస్తానని అన్నారు. టిడిపి కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. రాయలసీమను కరవు సీమగా, ఎడారి సీమగా కానివ్వబోమని హామీ ఇచ్చారు. పోలవరం తర్వాత ఆ స్థాయిలో నిధులు ఖర్చు చేస్తున్న ప్రాజెక్టు హంద్రీనీవా అని తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో వెలిగొండను పూర్తి చేయబోతున్నామని తెలిపారు. పోలవరం నుంచి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ నీరు ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వంశధార నుంచి పెన్నా వరకూ నదుల్ని అనుసంధానించాలన్నదే లక్ష్యమని అన్నారు. సముద్రంలోకి వృధాగా పోయే నీళ్లను వాడుకుంటే తెలంగాణాకూ లాభమేనని, బిఆర్ఎస్ దీనిపై లేనిపోని విమర్శలు చేస్తోందని అన్నారు. గోదావరిపై తెలంగాణాలో ప్రాజెక్టు కడితే తమకు అభ్యంతరం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలు రెండు తనకు సమానమేనన్నారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరిచ్చి రైతుల రుణం తీర్చుకోవడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్రానికి విద్యుత్ కొరత లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్రాన్ని క్లీన్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా రూపోందిస్తున్నామని తెలిపారు. కరెంటు ఛార్జీలు పెంచబోమని పునరుద్ఘాటించారు. ప్రతి నియోజక వర్గంలో కనీసం 10 వేల సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నేతలు అంతా ఇళ్లపై సోలార్ ప్యానళ్లు పెట్టుకోవాలని సూచించారు. రాయలసీమను అభివద్ధిలో అగ్రభాగాన నిలిపే బాధ్యతను టీడీపీ తీసుకుందని, ఇక్కడ డిఫెన్స్ పరిశ్రమల స్థాపన కోసం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. తిరుపతి, శ్రీశైలం లాంటి దివ్యక్షేత్రాలను పూర్తి స్థాయిలో అభివద్ధి చేస్తామన్నారు. 10 రోజుల్లో కడప స్టీల్ ప్లాంట్‌కు జిందాల్ కంపెనీ శంకుస్థాపన చేస్తుందని, రెండు దశల్లో రూ.9వేల కోట్లతో ప్లాంట్ ఉప్రముఖ పర్యాటక కేంద్రంగా గండికోటను తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదే అని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం సాధించామని, వక్స్ బోర్డు ఆస్తులను కాపాడతామని చెప్పారు.

**బాబు ఎన్నిక ఇలా**

టిడిపి అధ్యక్షుని ఎన్నికకు ఎన్నికల కమిటీ ఛైర్మన్ వర్ల రామయ్య మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. చంద్రబాబును అధ్యక్షుడిగా 21 మంది ప్రతిపాదించారు. ఇతరులెవరూ నామి నేషన్లు దాఖలు చేయలేదు. దీంతో చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వర్ల రామయ్య బుధవారం ప్రకటించారు. అనంతరం ఎన్నికల కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావు, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, షరీఫ్, దగ్గుమళ్ల ప్రసాద్ ఆయనకు ధృవీకరణ పత్రం అందించారు. ఆ తరువాత జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబుతో వర్ల రామయ్య ప్రమాణం చేయించారు.

## ప్రజలు మళ్లీ మమ్మల్ని గెలిపిస్తారు


# అప్పుడు వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తాం

### మహానాడు పెద్ద డ్రామా: జగన్



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ప్రజలు మళ్లీ తమను గెలిపిస్తారని, అప్పుడు వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని వైసీపీ అధ్యక్షుడు జగన్ అన్నారు. కడపలో మహానాడు పెట్టి తనను తి ట్టడం సత్తా కాదని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే అది నిజమైన సత్తా అవుతుందని వ్యాఖ్యానించారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ స్థానిక సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యారు. 'టీడీపీ అంటే.. తెలుగు డ్రామా పార్టీ. మహానాడు పెద్ద డ్రామా. కడపలో చంద్రబాబు పోజులు ఇస్తున్నారు. సూప ర్ సిక్స్, సూపర్ సెవెన్ గాలికి వదిలేశారు. ఉచిత బస్సు కోసం మహిళలు ఎదురు చూస్తున్నారు. అమ్మఒడికి పంగనామాలు పెట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన లేవు. ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేశారు. వైద్యం కోసం పేదలు అప్పులపాలవుతున్నారు. ఏడాదిగా రైతు భరోసా అందక చంద్రబాబు పాలనలో రైతులు బాధలు పడుతున్నారు. ధాన్యం సహా ఏ పంటకూ కనీస మద్దతు ధర లభించడం లేదు. ఏడాది పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేక పోయారు. ఉన్న 2.6 లక్షల మంది వలంటీర్లను తొలగించారు. మద్యం షాపుల్లో పనిచేసే 15 వేల మంది, రేషన్ బండ్లు నడుపుతూ జీవనోపాధి పొందే 20 వేల మందిని రోడ్డున పడేశారు. ఉద్యోగులకు ఐఆర్, పీఆర్‌సీ లేదు. డీఏ పెండింగ్‌లో పెట్టారు. చంద్రబాబు పాలనలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు. ఇసుక, మట్టి, సిలికా, క్వార్ట్జ్ లాంటి వనరులు దోచేస్తున్నారు.' అని జగన్ అన్నారు



## మణిపూర్ రాజకీయాల్లో

# అనూహ్య పరిణామం

- ప్రభుత్వ ఏర్పాటునకు తాము సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి తోక్చోమ్ రాధేశ్యామ్
- మొత్తం 44 మంది ఎమ్మెల్యేలు ప్రజాభీష్టం మేరకు మణిపూర్‌లో ప్రభుత్వ ఏర్పాటునకు సిద్ధంగా ఉన్నారు.

## విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న

# బీఆర్ఎస్ ప్రభుత్వం



- కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయి
- గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీకి ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదు
- పీజీలు చేసిన విద్యార్థులు ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయారు
- కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు
- మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చింది

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండపడ్డారు. తమ ప్రభుత్వం హయాంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బాబూ జగజ్జీవన్‌రామ్ భవన్‌లో ఎస్సీ గురుకులాల్లో టెన్త్, ఇంటర్ చదివి.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీకి ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన నిలదీశారు. పీజీలు చేసిన విద్యార్థులు ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయారని - మిగతా3లో



# 14 పంటలకు ఎంఎస్‌పీ పెంపు

- బద్వేల్-నెల్లూరు 4లేన్ రోడ్డు అభివృద్ధికి కేంద్రం ఆమోదం
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది.
- బద్వేల్-నెల్లూరు నాలుగు లైన్ల రహదారి విస్తరణకు ఆమోదం
- 3,653 కోట్ల రూపాయలతో బద్వేల్-నెల్లూరు నాలుగు లైన్ల రహదారి విస్తరణ
- రత్లాం-వార్ధా మధ్య రైల్వే లైన్‌కు ఆమోదం



## ఉగ్రవాదుల అంత్యక్రియల్లో


# ఆర్మీ అధికారులు

- ఇంతకంటే సాక్ష్యం ఏంకావాలి
- ఆ దేశ ఉగ్రవాదానికి సంబంధించి పబ్లిక్ డొమైన్‌లో ఎన్నో సాక్ష్యాలున్నాయి
- జాతీయ భద్రత, దేశ సార్వభౌమాధికారం అనేవి రాజకీయ విభేదాలకు అతీతం
- పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందనడానికి ఎన్నో సాక్ష్యాలు ఉన్నాయి

## కొవిడ్ మళ్లీ పెరగడానికి కారణమేంటీ?

# ఆందోళన అవసరమా?!

- తాజాగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు
- కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్‌ఎఫ్.7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం ఇదివరకే వెల్లడి
- కొవిడ్ నిర్ధారణ పరీక్షలు విస్తృతం



## వ్యక్తిగత దూషనలకు దిగితే

# చర్యలు తప్పవు

- బీజేపీ నేతలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వార్నింగ్
- పార్టీ కార్యాలయాన్ని వ్యక్తి గత అవసరాలకు వాడుకుంటే ఊరుకునేది లేదు
- బీజేపీ అంటే బాధ్యతగల పార్టీ అని సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన పార్టీ

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ముఖ్యనేతలతో సమావేశమై నేతలకు క్లాస్ ఇచ్చారు. కొందరు నేతలు వ్యక్తిగత ఎజెండాలో పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు - మిగతా3లో



చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 28:** ఘనముగా నిర్వహించవలసినదిగా GOM S నెం.54 తేదీ: 26న ఉత్తర్వులు జారీ చేసియున్నారు. అందుపై కుప్పం పురపాలక సంఘములో మాజీ ముఖ్యమంత్రి కీర్తి శేషులు నందమూరి తారక రామారావుకి కమిషనర్ కుప్పం పురపాలక సంఘము పురపాలక సంఘము సిబ్బంది. ఆధ్వర్యములో ఘనముగా జయంతి కార్యక్రమము నిర్వహించి ప్రభుత్వ విప్ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్, మునిరత్నం, ప్రాజెక్ట్ డైరెక్టర్ కడా, కుప్పం, చైర్ పర్సన్, కౌన్సిలర్లు కో-ఆప్షన్ మెంబర్ తరపున ఘనముగా నివాళులు అర్పించినారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయలో
# ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు





**గుడిపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 28:** కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం లోని ద్రావిడ విశ్వవిద్యాలయలో ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జన్మదినాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో ఘనంగా, భక్తితో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్టీఆర్ పేరు మీద ఉన్న ఎన్టీఆర్ క్లాసురూమ్ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ముందుగా విశ్వవిద్యా లయంలో నెలకొల్పిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆంధ్రప్ర దేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జన్మదినాన్ని రాష్ట్ర వేడుకగా ప్రకటించడంతో, విశ్వవి ద్యాలయం ఈ కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వైస్-చాన్సలర్ ఆచార్య ఎం. దొరస్వామి ఎన్టీఆర్ కీర్తిని ఘనంగా స్మరించారు పరిరక్షణలో చేసిన అపార సేవలను గుర్తుచేశారు. ఆయన భావనా శక్తితోస్ఫూర్తి పొందిన ఈ సంస్థవిద్య, సాంస్కృతిక పరిరక్షణలో ఆయనకు కలిగిన ప్రగాఢ ఆలోచనలకు ప్రతీకగా నిలిచింది."ఎన్టీఆర్ కేవలం రాజకీయ నేత మాత్రమే కాక,సాంస్కృతిక చిహ్నంగానిలిచారు. ఆయన విద్యను, వారసత్వాన్ని ఎంతో మక్కువగా భావించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం వంటి సంస్థల స్థాపన ద్వారా ఆయన సమగ్ర విద్యార్థిభ్యాసానికి పునాది వేసిన వారు అని కొనియాడారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ "ఎన్టీఆర్ విద్యను సామాన్యుల బలం పెంపొందించే మూల మని నమ్మారు.ముఖ్యంగా గ్రామీణ బహుళముఖ్య సమాజాలకు సమాన అవకాశాలు కల్పించే విధంగా ఆయన అనేక కార్యక్రమాలు చేపట్టారు. అని కొనియాడారు. డీన్ అకడ మిక్ అఫైర్స్ఆచార్య కే.శ్యామల మాట్లాడుతూ"ద్రావిడ సాంస్కృతిక పరిరక్షణపై ఎన్టీఆర్ గొప్ప దృష్టి నాకు ప్రేరణ. ఆయన ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం ద్వారా జ్ఞానంలోని మహ త్తును బలంగా తెలియజేశారు." "ఎన్టీఆర్ జీవితం విద్యార్థులకు, ఉపా ధ్యాయులకు స్ఫూర్తిగా ఉంటుంది. ఆయన వారసత్వం మాకు శ్రేష్ఠత, సేవాభావం మరియు సామాజిక బాధ్యతలపై దృష్టి పెట్టడానికి ప్రేరణగా నిలుస్తోంది అని కొనియాడారు. ఈ కార్యక్రమం సాంస్కృతిక ప్రదర్శనలతో,ఎన్టీఆర్ చిత్రానికి పుష్పని వేదనతో ముగిసింది.ఈ వేడుక ఆయన గొప్ప వారసత్వా న్ని గుర్తు చేసుకొని, అందరూ ప్రేరణతో నిండిపోయారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్ విజయవర్ధిని, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ ఉద్యోగస్తులు విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విజయవంతంగా పీలేరులో
# మినీ యోగాంధ్ర కార్యక్రమము.




**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 28:**
అన్నమయ్య జిల్లా పీలేరు మండల ప్రభుత్వ అధికారులు మండల వ్యాప్తంగా ప్రజలకు యోగా పైన అవగాహన కల్పిస్తూ పీలేరు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్‌లో యోగాంధ్రలో భాగంగా అంత ర్జాతీయ యోగా దినోత్సవం యోగ ప్రోటో కాల్ పై శిక్షణ మరియు యోగా డెమోలు, యోగా కాంపిటీషన్స్ నిర్వహించడం, జరిగినది.ఈ కార్యక్రమంలో పీలేరు మండల తాసిల్దార్ భీమేశ్వరరావు ఎంపీడీవో శంకరయ్య నా పంచాయతీ ఈవో గురు మోహన్ డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. యోగా అనేది ప్రతి ఒక్కరికి అవసరము జీవనశైలిలో ఒక భాగంగా యోగాను చేసుకున్నట్లయితే మందులకు డబ్బులు వెచ్చించాల్సిన అవసరం తగ్గుతుందని యోగ ద్వారా అనేక రకాల జబ్బులు తగ్గుముఖం పట్టడం జరుగుతుందని తెలియజేశారు.అలాగే యోగా తెరపిస్ట్ డాక్టర్ పి.వి ఎస్ లక్ష్మీ సుధాకర్ దంపతులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ తాము గత 25 సంవత్సరాలుగా యోగ మార్గంలో ఉంటూ ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా సంచరించి అన్ని ప్రదేశాలలో యోగా కేంద్రాలను నెల కొల్పడమే కాకుండా పలువురికి యోగాపై అవ గాహన కల్పించి వారిని సంపూర్ణ ఆరోగ్యానికి దగ్గర చేసినట్లు తెలియజేశారు. ఇప్పుడు 11వ అంతర్జాతీయ యోగాదినో త్సవాన్ని నిర్వహించుకుంటున్నామని గత పది సంవ త్సరాలు గా తమ సొంత నిధులతో అంత ర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను పీలేరులో మంగ నిర్వహించడం జరిగిందన్నారు.

## తహసిల్దార్ కార్యాలయంలో
# ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 28:**



చౌడేపల్లి స్థానిక మండల పరిపాలన భవనంలోని తాసిల్దార్ కార్యాలయంలో దివంగత నేత ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల తహసిల్దార్ హనుమంతు ఆధ్వర్యంలో కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటాన్నిఉంచి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దివంగత ఎన్టీఆర్ మాజీ ముఖ్య మంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తరతరాలకు తరగని వెలుగు.. యుగపురుషుడు ఎన్.టి.ఆర్

## చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

## మహానాడులో తారకరాముడిని స్మరించుకున్న చిత్తూరు పార్లమెంటు సభ్యులు

**కడప, (చిత్తూరు)చిత్తూరు, ఎక్స్ ప్రెస్, మే 28:** తరతరాలకు తరగని వెలుగు.., యుగపురుషుడు ఎన్.టి. ఆర్.. అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు కొనియాడారు. కడప వేదికగా జరుగుతున్న రెండో రోజు మహానాడులో తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నంద మూరి తారక రామారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాచిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ.., ఆ మహా నేతను స్మరించుకోవడంతో పాటు ఎన్టీఆర్ తెలుగుజాతికి అందించిన సేవలను గుర్తుకు చేసుకున్నారు.'కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు. మహా పురుషులౌతారు. తరతరాలకు తరగని వెలుగవుతారు, ఇలవేలుపు లౌతారు.' అంటూ వేటూరి రాసిన పాట.. తెలుగుతెర ఇలవేల్పు నందమూరి తారక రామారావుకు సరిగ్గా సరిపోతుందని చెప్పారు. ఆయన సినీ ప్రస్థానం అంతా ఆ పాట పల్లవిలోనే కనిపిస్తుందనితెలిపారు. చిత్ర పరిశ్రమలో ఎంతో మంది నటులు ఉంటారు. వివిధ తరహా పాత్రలు పోషించి ప్రేక్షకుల్ని మెప్పిస్తారు.కానీ, ప్రేక్షకులు దైవంగా భావించే మహానటుడు ఎన్.టి. రామా రావు ఒక్కరేనన్నారాయన.బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం అహ ర్నిశలు శ్రమించిన నందమూరి తారక రామా రావు.., ప్రజా సేవకుడిగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారన్నారు. దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించి.., ప్రజాస్వామ్య విలువల్ని కాపాడి.., అసలు సిసలైన రాజకీయనేతగా..,రాజకీయాలకే వన్నె తెచ్చి.. ఎందరికో ఆదర్శంగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలో ఎంతో మంది మహానుభావులు పుట్టారు. వారి వారి రంగాల్లో అద్భుతమైన విజ యాలు సాధించి పది మందికీ ఆదర్శంగా నిలిచారు. అయితే అందులో కొందరు కారణజన్ములుగా పేరు తెచ్చుకున్నారు. ప్రజలు వారిని దైవంగా కొలిచారు. తమ గుండెల్లో పవిత్రమైన స్థానాన్ని ఇచ్చారు. అలాంటి అతి కొద్దిమంది మహాను భావుల్లో విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నంద మూరి తారకరామారావు అనికీర్తించారు. ఆ మహా నాయకుడి స్ఫూర్తితోనే ప్రస్తుతం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ముందు కు సాగుతూ..



ఎన్టీఆర్ ఆశయాలను కొన సాగిస్తూ నవ్యాంధ్ర నిర్మాణానికి బాటలు వేస్తున్నారని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలియజేశారు

# తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో,ఢిల్లీ పెద్దల అవ మానాలతో పుట్టిందే తెలుగుదేశంపార్టీ

## మహానాడు కార్యక్రమంలో పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 28:**



ప్రసంగంలోని అంశాలు.. తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో,ఢిల్లీ పెద్దల అవ మానాలతో పుట్టిందే తెలుగుదేశంపార్టీ.. పార్టీ స్థాపించిన తరువాత పెత్తందారుల నుండి బడుగు బలహీన వర్గాలకు అధికా రాన్ని అందించిన పార్టీ తెలుగుదేశంపార్టీ, సంక్షేమానికి ఒక అర్థం చూపిన పార్టీ తెలుగుదేశం పార్టీ రాజకీయంగా, సామా జికంగా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభి వృద్ధి పథంలో 43 వసంతలుగా నడిపిస్తు న్న పార్టీ తెలుగుదేశం పార్టీ గండిపేట ఒక రాజకీయ పాఠశాల, అక్కడ ఎంతోమంది నాలాంటి యువకులను నాయకులుగా తయారుచేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎంతో మంది నాయకులకు అవకాశాలు కల్పించి న పార్టీ తెలుగుదేశం పార్టీ..ఓవైపు రాజకీ యంగా మరోవైపు అభివృద్ధి పరంగా ముందుకు వెళ్తూన్న పార్టీ తెలుగుదేశం పార్టీ..ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తర్వాత ఆశయాలకు అనుగుణంగా నేటి వరకు పార్టీని దిగ్విజంగా నడిపిస్తున్న నాయ కుడు చంద్రబాబు నాయుడు,రాజకీయ విలువలతో ప్రజాస్వామ్యబద్ధంగాతెలుగు దేశంపార్టీని బుధవారంరోజు వరకు నడిపించు కుంటున్నాం, ఎవరో స్థాపించిన పార్టీని లాక్కుని తల్లికి చెల్లికి పోటీ వస్తార ని భయపడి శాశ్వత అధ్యక్షుడుగా పార్టీకి ప్రకటించుకున్న పార్టీ తెలుగుదేశంపార్టీ కాదుప్రతి రెండేళ్లకు ఓసారి ప్రజాస్వామ్య బద్ధంగా కార్యకర్తలే అధినేతలని ప్రకటిం చిన పార్టీ తెలుగుదేశం పార్టీ.రాయలసీమ ఎప్పటినుంచో వెనుకబడిన ప్రాంతం, ఉత్త రాంధ్ర వెనుకబడిన ప్రాంతం. ఇలాంటిప్రాం తంలో సాగునీరు అందించి ఫ్యాక్షనిజాన్ని రూపుమాపి ఇక్కడ ఉపాధి అవకాశాలు కల్పించడానికి అన్నివిధాలా కృషిచేసిన నాయకుడు మన చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజకీయంగా తెలుగుదేశం పార్టీ వారిపై ఎంతో దౌర్జన్యం చేశారు.లోకేష్ బాబు యువగళం పాద యాత్ర ప్రారంభిస్తే ఎన్నో అడ్డంకులు సృష్టించారు.కుప్పం నుంచి విశాఖ దాకా ప్రతీ చోటా అడ్డంకులు సృష్టించినా ధైర్యం గా ఎదురొడ్డి నిలబడి పార్టీని ముందుకు తీసుకెళ్లిన ఘనత నారా లోకేష్ గారికే దక్కింది.గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో కూటమి అధికారంలోకి రావడానికి యువ గళం పాదయాత్ర కూడా ఒక ప్రధాన కార ణం.తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ పార్టీ అయినప్పటికీ జాతీయ భావాలు కలిగిన పార్టీ.ప్రాంతీయ పార్టీగా ఉన్నా కేంద్రంలో ఎన్నోసార్లు చక్రం తిప్పిన ఘనత తెలుగు దేశం పార్టీది.ఈ విధంగా అన్ని అంశాల్లో రాష్ట్ర అభివృద్ధికి ముందుండి నడిపించే టువంటి పార్టీ తెలుగుదేశం మన నాయ కుడు చంద్రబాబు నాయుడు.ఆధునిక రాజకీయ తత్వశాస్త్రం తెలిసిన ఎన్నోఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు యొక్క ప్రస్థానాన్ని ఒక పాఠ్యాంశంగా తీసుకోవాలనేదే రాజకీయ వేదికగా తెలియజేస్తున్న కడపలో మహా నాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసి న ప్రతి నాయకుడు కార్యకర్తకు ధన్యవాదాలు

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,మే 28:** తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు దేశంలో సంక్షేమపాలనకు ఆద్యుడు సినీ, రాజకీయ రంగాలలో విశ్వవిఖ్యాతుడు, పేద బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి తెలుగు ప్రజల గుండె చప్పుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా చౌడేపల్లి బస్టాండ్ నందు ఆ మహనీయునికి పూలమాలవేసి నివాళ్ళు ఏర్పించిన చౌడేపల్లి మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) మాట్లాడుతు నందమూరి తారక రామారావు మనమధ్య లేకపోయిన మన గుండెల్లో చిరస్థాయిగా నిలిచి వున్నారని ఆ మహనీయుని సేవలు భవిష్యత్తు తరాలు సైతం మరచిపోరని ప్రతిపేద వాడి జీవితంలో వెలుగులు నింపిన మహను భావుడని కొనియాడారు. అనంతరమ్ నాయకులు కార్యకర్తలు కేక్‌కట్ చేసి అందరికి పంచిపెట్టారు మరో కసారి ఎన్టీఆర్‌ను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. కార్యక్రమములో మండల నాయకులు బోయకొండ, సుబ్బు రాజారెడ్డి, వెంకటరమణ, పవన్, అర్జున్‌రాయల్, ముని, వెంకటప్ప, చంగల్ రాయుడు, నారాయణరాజు, కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున పాలుగొన్నారు.

# యోగాతో మానసిక ఒత్తిడి దూరం



**చౌడేపల్లి ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 28:**
యోగా చేయడం వల్ల మానసిక మిత్రుల కు దూరంగా ఉండవచ్చు నని ఎంపీడీవో లీలామాసవి అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలఆవరణలో మండల స్థాయి అధికారులతో యోగాంధ్ర కార్య క్రమంలో భాగంగా యోగా శిక్షణ ఇచ్చారు. నిత్యం ప్రజలతో వారి సమస్యల పట్ల చర్యలు తీసుకునే అధికారులు యోగా చేయడం వల్ల వారి పడే ఒత్తిడిలకు దూరంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ యోగ చేయడం వల్ల ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనుభవిస్తారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని నాలుగు రోజులపాటు నిర్వ హిస్తారని ప్రతి ఒక్కరూ పాల్గొని ఆరోగ్య వంతంగా ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉద్యోగు లదురు పాల్గొన్నారు.

# తెలుగు వారి ఆరాధ్య దైవం ఎన్టీఆర్

**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 28:**



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు.మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు వారి ఆరాధ్య దైవం అని టిడిపినాయకులు ఇనాయ్ తుల్లా అన్నారు. కడపలో జరుగుతున్న మహా నాడు వేదికలో టిడిపినాయకులు ఎన్టీఆర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం.ఈశ్వరయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవ హక్కుల నియోజకవర్గం
# ట్రెజరర్‌గా రమణ రెడ్డి ఎన్నిక.




**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 28:**
జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ పలమనేరు నియోజక వర్గం ట్రెజరర్‌గా రమణారెడ్డిని ఎన్నిక చేసినట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు డివి మునిరత్నం, యువజన నాయకుడు సోమరాజు, మణి ఓ ప్రకటనలోతెలిపారు. అందులో భాగంగా బుధవారం పలమనేర్ పట్టణంలోని మానవ హక్కుల కార్యాలయంలో డి. సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూమ జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పై నిరంతరం పోరాటం చేస్తున్న మానవ హక్కుల సంస్థపై రమణా రెడ్డికి నమ్మకం కుదరడంతో ఆకర్షితుడై సంస్థలో చేరడం జరిగిందని పేర్కొన్నారు. ఇటువంటి ప్రజాసేవ చేయాలని అంకితభావం, నమ్మకం, పారదర్శకత, నిస్వార్థముతో పనిచేయాలనే సంకల్పం ఉన్న వారు అనేక మంది ముందుకు వస్తున్నవారని తెలిపారు. అందులో రమణారెడ్డి మంచి ఉత్సాహముతో ముందుకు వచ్చారన్నారు. సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతనముగా ట్రెజరర్‌గా ఎన్నికైన రమణారెడ్డి మాట్లా డుతూ మానవ హక్కుల సంస్థ జిల్లా నాయకులు తనపై నమ్మకముతో ప్రజలకు సేవ చేయడానికి ట్రెజరర్ బాధ్యతను ఇచ్చిన జిల్లా నాయకులకు నియోజకవర్గ నాయకులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ తాను ఎల్లవేళలా నిస్వార్థముతో తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయ కుండా ప్రజలకు సేవచేస్తానని ధీమావ్యక్తం చేశారు.ఎన్నో ఏళ్ల నుండి ప్రజల సమస్యలపై పోరాడుతున్న మానవ హక్కుల సంస్థపై తనకు నమ్మకం కలిగి సంస్థలో చేరాన న్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు సరస్వతి, శ్రీదేవి, అజరుద్దీన్ సాంబ శివ, శ్రీనివాసులు, ఆనంద్ శివకుమార్, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పురాణాలకు సంప్రదాయాలకు
# మార్గదర్శక లాంటివి మహాభారతాలు

**కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 28:**



పురాణాలు సంప్రదాయాలకు మార్గదర్శ లాంటివని డ్వామా.ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరత్నం, డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, రిటైర్డ్ డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ వరప్రసాద్ అన్నారు. చిత్తూరు జిల్లా మంగళంపేటలో జరిగిన మహాభారత యజ్ఞం కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహాభారతంలో కీలక ఘట్టమైన దుర్యోధన వధను. అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఘట్టాన్ని పాత్రధారులు రక్తి కట్టించి వీక్షకులను అలరింపచేశారు. మహాభారత యజ్ఞానికి విరాళంఅంద జేసిన ఉన్నతాధికారులను మహాభారత ఆలయ ధర్మకర్తలు ఘనంగా సన్మానించారు.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

-మొదటిపేజీ తరువాయి

ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న పిల్లలకు తాము ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. ఒక్క ఏడాదిలోనే 59 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. గత 15 ఏళ్లుగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదన్నారు. తమ హయాంలో 563 గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. గ్రూప్-1లో 89% పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కాయని సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు.

ఇంకా సీఎం రేవంత్ రెడ్డి ఏమన్నారంటే.. ఈ రోజు అంటే బుధవారం తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి అని గుర్తు చేశారు. వారి స్ఫూర్తిని కొనసాగించేందుకు తెలుగు యూనివర్సిటీకి వారి పేరు పెట్టుకున్నామన్నారు. కోటిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారని ఆయన స్పష్టం చేశారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు%ౌ% మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఆత్మనూన్యత భావాన్ని వీడాలంటూ దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. వారిలోని ఆత్మనూన్యత భావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బర్రెలు, గొర్రెలు, చేపలు వంటి స్కీములు తెచ్చారని గుర్తు చేశారు. కానీ మీకు చదువు చెప్పి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది వాస్తవం కాదా? అని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కానీ మేం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. అంతేకాదు గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశామన్నారు. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు.. రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని గత ప్రభుత్వ పెద్దలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారు. అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతోందని పేర్కొన్నారు. వాళ్లింట్లో ఎన్నికల్లో ఓడిపోతే ఆరు నెలలు తిరగకుండానే ఇంకో ఉద్యోగం ఇచ్చుకున్నారని బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కానీ మీకు మాత్రం ఉద్యోగాలు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. అలాంటి వారు మీకు ఎదురైతే ప్రశ్నించండంటూ యువతకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మొదటి పాతికేళ్ల వయసు వరకు బాగా చదువుకుంటేనే మీరు మీ జీవితంలో రాణిస్తారన్నారు. తప్పుదారి పడితే కన్న తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి ఉంటుందని విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. అలాంటి పరిస్థితులు ఎప్పుడూ తెచ్చుకోవద్దంటూ విద్యార్థులకు హితవు పలికారు. కష్టపడండి.. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో రాణించి తల్లిదండ్రులకే కాదు.. రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో తొలిసారిగా దళితుడిని వైస్ చాన్స్‌లర్‌గా నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించామని గుర్తు చేశారు. అలాగే అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామని వివరించారు. వీరందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదు.. చదువుకున్నారు కాబట్టే వారికి ఈ గుర్తింపు వచ్చిందని విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందన్నారు. అన్ని రంగాల్లో మీరు రాణించాలని మనస్ఫూర్తిగా తాను కోరుకుంటున్నానని తెలిపారు. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## వ్యక్తిగత దూషనలకు దిగితే చర్యలు తప్పవు

-మొదటిపేజీ తరువాయి

ప్రెస్ మీట్లు పెట్టి వ్యక్తిగత దూషనలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి తప్పనిసరి పార్టీకార్యాలయాన్ని వ్యక్తి గత అవసరాలకు వాడుకుంటే ఊరుకునేది లేదని నేతలకు గట్టిగా చెప్పారు. పార్టీ ఆఫీసులో పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలని సూచించారు. ఇక మీదట ప్రెస్ మీట్లు పెట్టాలంటే అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇది తనతో పాటు అందరికీ వర్తిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ పార్టీ నేతలు హూందాగా ప్రవర్తించాలని సూచించారు.

### పోరాటం చేయాలి

బీజేపీ అంటే బాధ్యతగల పార్టీ అని సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన పార్టీ అని కీలక వ్యాఖ్యాలు చేశారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ ఆఫీస్‌ను ఆశ్రయిస్తున్నారని.. అలాంటి వారికి న్యాయం చేసేలా నేతలు పోరాటం చేయాలని సూచించారు. అలా కాకుండా, ఇష్టం వచ్చినట్లు ప్రెస్‌మీట్‌లు పెట్టి వ్యక్తిగత దూషణలకు దిగుతే చర్యలు తప్పవని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్




**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 28:**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు అని టిడిపి యువ నాయకుడు సాఫ్ట్వేర్ బాలు అన్నారు ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా ఎస్ఆర్ పురం మండలం పిల్లారి కుప్పం క్రాస్ రోడ్డు జంక్షన్ లో ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాఫ్ట్వేర్ బాలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు అని ఆయన తెలుగుదేశం పార్టీలో చేసిన సేవలను కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అందించిన మహోన్నతుడు నందమూరి తారక రామారావు అని సాఫ్ట్వేర్ బాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ కుమార్ మూలూరు చెరువు ఆయకట్టు చైర్మన్ ఉమాపతి రెడ్డి గల్లా గిరి వంశీ వినయ్ దుర్గా తిరుమల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకతాయిలా ఆట కట్టిస్తాం...

### డి.ఎస్.పి సయ్యద్ మహమ్మద్ అజీజ్
### కటింగ్ షాప్ దాడికి పాల్పడిన ముగ్గురు ఆకుతాయలను అరెస్ట్

**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,28:**



గ్రామాల్లో అల్లర్లుగొడవలు చేసే ఆకతాయిలా ఆటలను ఆట కట్టిస్తాం అని నగిరి డిఎస్పి సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. ఎస్ఆర్ పురం మండలం పిల్లారి కుప్పం క్రాస్ రోడ్డు కటింగ్ షాపు పని చేసే ఓ వ్యక్తిని చిన్న తయూరు గ్రామానికి చెందినచందు, ప్రశాంత్, ఉదయ్ వీరు ముగ్గురుయువకులు మద్యం సేవించి కటింగ్ షాపు పనిచేసే వ్యక్తిపై అకారణం గా దాడి చేసిన వీడియో సోషల్ మీడియా లో వైరల్ అయింది. ఈ సంఘటన తెలుసుకున్న నగిరి డిఎస్పి ఆదేశాలతో ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ కటింగ్ షాపులో దాడికి పాల్పడిన చిన్న తయ్యూరు గ్రామానికి చెందిన చందు ప్రశాంత్ ఉదయ్ ఈ ముగ్గురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఆర్ పురం తాసిల్దార్ ముందు బైండో వర్ చేయడం జరిగింది, ఈ సందర్భంగా ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ గ్రామాల్లో మద్యంసేవించి గంజాయి సేవించి అల్లర్లు గొడవలు చేసే యువకులు ఎవరైనా ఉంటే వారిపై రౌడీషీట్ నమోదు చేస్తాం అలాంటి ఆకుతాయిలు అల్లర్లుఇక పై సాగవు ఎక్కడైనా ఇలాంటివి జరిగితే వెంటనే 944090 0692కు తెలియజేయాలని ఎస్ఐ సుమన్ తెలిపారు.

# ఈ సారి నలుగురికి అవకాశం



**హైదరాబాద్ :** తెలంగాణలో కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం కూర్పుపై ఢిల్లీలో వరుస సమావేశాలు జరుగుతున్నాయి. కేబినెట్ లో ఆరు పదువులు ఖాళీ ఉండగా.. కొత్తగా నలుగురిని తీసుకోవాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం దక్కనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ సామాజిక వర్గాలకు చెందిన నేతల పేర్లనుసైతం కాంగ్రెస్ హైకమాండ్ ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ టెన్ జన్‌పథ్‌లోని సోనియాగాంధీ నివాసంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పార్టీ వ్యవహారాల జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ భేటీ అయ్యారు. తెలంగాణ కేబినెట్ లో మొత్తం ఆరు ఖాళీలు ఉండగా అందులో ప్రస్తుతం ఐదింటిని భర్తీ చేయడానికి హైకమాండ్ అంగీకరించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చినప్పటికీ విస్తరణకు ముహూర్తం మాత్రం ఇంకాఖరారు కాలేదు. శుభముహూర్తాలు ఈ నెల మొదటి వారంతో ముగియనుండటంతో ఈ రోజు విస్తరణ జరిగే అవకాశముందని కూడా కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేసీ వేణుగోపాల్, రాహుల్ గాంధీతో చర్చించిన అనంతరం విస్తరణకు రెడీ అయినట్లు సమాచారం. తెలంగాణ మంత్రివర్గ విస్తరణతోపాటు పీసీసీ నూతన కార్యవర్గం అంశాలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అంతేకాక నాలుగు మంత్రి పదవుల భర్తీకి సంబంధించి ఏడుగురి పేర్లు ప్రయారిటీలో ఉన్నాయని వివరించారని, దానిపై లిస్ట్ కూడా అందజేసినట్లు సమాచారం. అదేవిధంగా నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, తక్కువ సంఖ్యతో కూడిన పీసీసీ కార్యవర్గ లిస్ట్ ను సమర్పించినట్లు తెలిసింది. వేణుగోపాల్ తరువాత టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కూడా రాహుల్ తో భేటీ అయ్యారు. కేబినెట్ కూర్పు, పీసీసీ కార్యవర్గం, కవిత లేఖ, రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై రాహుల్ ఆరా తీసినట్లు తెలిసింది. రాహుల్‌తో భేటీ తరువాత మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. మంత్రి వర్గ విస్తరణకు సంబంధించి ఇప్పటికే రెండు సార్లు మా అభిప్రాయాలను అధిష్టానానికి చెప్పామని, కేబినెట్ లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. త్వరలోనే కేబినెట్ కూర్పు ఉంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అయితే, ఒకటి రెండు రోజుల్లో పీసీసీ కార్యవర్గం ప్రకటన ఉంటుందని మహేశ్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణ కేబినెట్ లో కొత్తగా నలుగురికి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నాలుగు మంత్రి పదవులకుగాను ఏడుగురు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు, వీరిలో నాలుగు సామాజిక వర్గాలకు చెందిన నలుగురిని కాంగ్రెస్ హైకమాండ్ ఫైనల్ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. వాస్తవానికి మంగళవారమే కేబినెట్‌లో చోటుదక్కించుకున్న వారి పేర్లపై ప్రకటన రావాల్సి ఉన్నా ఏఐసీసీ చీఫ్ మల్లిఖర్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో వాయిదా పడినట్లు తెలిసింది. బీసీ కోటాలో వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు అనుగుణంగా మంత్రివర్గంలో ఎంపిక చేయాలని కూడా అధినాయకత్వంతో రేవంత్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. ఇక హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాలకు కూడా కేబినెట్ లో ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ ఎక్కువగా వినిపిస్తుంది. అయితే దీనిపై ఇంకా నిర్ణయం జరగలేదంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండగా ఇప్పటి వరకూ విస్తరణ జరగక పోవడంతో నాయకుల్లోనూ, ఆశావహుల్లోనూ అసంతృప్తి ఎక్కువగా ఉంది. మల్లికార్జున ఖర్గే తో సమావేశం జరిగిన తర్వాత ముహూర్తం విస్తరణకు ఫిక్స్ అయ్యే అవకాశాలున్నాయని తెలిసింది. ఖర్గే ఈనెల 30న ఢిల్లీకి వస్తారని తెలుస్తోంది. ఆయన రాగానే మంత్రి వర్గం విస్తరణపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా వాయిదా పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఆశావహులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

# కవితకు బలాలు ఏంటీ... బలహీనతలు ఏంటీ

**హైదరాబాద్ :** కల్వకుంట్ల కవిత. తెలంగాణలో కేసీఆర్ కుమార్తెగా ప్రజలకు పరిచయం అయిన కవిత ఆ తర్వాత కాలంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. అటు ఉద్యమంలో, ఇటు రాజకీయాల్లో తనకుంటూ ఓ స్థానం ఏర్పాటు చేసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారు ఉండరు. తెలంగాణలో ఇక చెప్పనక్కరలేదు. తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఉన్న ప్రతీ ఒక్కరికీ కవితకు ఉద్యమ రాజకీయాలు, తెలంగాణ రాజకీయాలతో ఉన్న సంబంధాలు తెలుసు. అయితే మైడియర్ డాడీ అంటూ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ ఇప్పుడు సంచనలమైంది. బీఆర్ఎస్ పార్టీ చీలుతుందా అన్న చర్చ దగ్గరి నుంచి కవిత కొత్త పార్టీ పెట్టేస్తున్నారనే వార్తలు చక్కర్లు కొట్టే స్థాయికి చేరాయి. అయితే బీఆర్ఎస్ లో ఏదో జరుగుతుందన్నది మాత్రం ఆమె లేఖ ద్వారానే బహిర్గతమైంది. అయితే ఇప్పటి వరకు దీనిపై పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ నర్మగర్భంగా మాట్లాడటం మినహా అందరూ సైలంట్ గా ఉన్నారు. ఈ అంశాలపై చర్చించేందుకు కేసీఆర్ నుంచి కవితకు ఎలాంటి పిలుపు రాలేదు. అయితే కేసీఆర్ దూతలుగా రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు, పార్టీ లీగల్ సెల్ ఇంఛార్జి గండ్ర మోహన్ రావు మూడు గంటల పాటు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో తన లేఖను బయటపెట్టిన వ్యక్తులెవరో తెల్చాలని, తన రాజకీయ భవిష్యత్తుపై హమీ ఏంటని, పార్టీలో తన స్థానం ఏంటని కవిత ప్రశ్నించినట్లు తెలిసింది. కేసీఆర్‌తో నేరుగా చర్చించాలని తాను అనుకుంటున్నట్లు వారితో కవిత చెప్పినట్లు సమాచారం. రానున్న రోజుల్లో దీనిపై బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఏం నిర్ణయం తీసుకుంటారు. ఒక వేళ ఈ విషయంలో ఆయన మౌనం దాల్చితే కవిత ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పడే చేప్పలేం. అయితే ఒక వేళ ఈ చర్చలు విఫలమై కవిత పార్టీ పెడితే ఎలా ఉంటుంది? అసలు పార్టీ పెట్టే శక్తి కవితకు ఉందా? తెలంగాణలో కొత్త పార్టీకి అవకాశం ఉందా ? కవిత కొత్త పార్టీ పెడితే ఏ పార్టీ నష్టపోతుంది ? అన్న అంశాలు చూద్దాం.

### కవిత ప్లస్ పాయింట్స్ ఏంటంటే??

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ కూతురుగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. అదే రీతిలో పార్టీలో కేసీఆర్ తర్వాత కేటీఆర్, హరీశ్ రావుకు ఎలాంటి ఫాలోయింగ్ ఉందో అలాంటి ఫాలోయింగ్ ను కవిత సంపాదించుకున్నారు. కొత్తగా తనను తాను తెలంగాణ ప్రజలకు పరిచయం చేసుకోనక్కరలేని మంచి అవకాశం కవితకు ఉంది. ఇది ఓ పార్టీ పెట్టడానికి మంచి బలాన్ని ఇచ్చే అంశంగా చెప్పవచ్చు. తెలంగాణ ఉద్యమంలో కవిత పాత్రకు మంచి గుర్తింపు ఉంది. తెలంగాణ జాగృతి వంటి సంస్థను స్థాపించి, ఆ సంస్థతో తెలంగాణ భాష, సంస్కృతి, పండుగల పట్ల ప్రజల్లో ఓ చైతన్యాన్ని తీసుకురావడంలో సఫలీకృతం అయ్యారు. ఈ సంస్థ ద్వారా తెలంగాణ ప్రజలో ఓ సంబంధాన్ని ఏర్పరుచుకోగలిగారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు ఈ సెంటిమెంట్ ఏదో రూపంలో ఉపయోగపడుతుంది. కవిత కొత్త పార్టీ పెడితే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తీరు, ఉద్యమ కేసుల్లో ఉండంటం వంటి అంశాలు ప్రజలను దగ్గర చేసేందుకు ఉపయోగపడతాయి. పార్టీ ప్రారంభానికి ఇది ఓ ఉపయోగపడే అవకాశం ఉంది. కవిత ఇప్పటికే అధ్యక్షురాలిగా ఉన్న తెలంగాణ జాగృతి సంస్థ కొత్త పార్టీ ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇప్పటికే తెలంగాణలోని గ్రామ స్థాయి వరకు తెలంగాణ జాగృతి సంస్థను కవిత విస్తరింప జేశారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ అంతటా ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లోను, విదేశాల్లోను జాగృతి శాఖలు ఉన్నాయి. కొత్త పార్టీ పెట్టేందుకు ఈ బేస్ కవితకు బాగా లాభిస్తుంది. కొత్తగా పార్టీ ఏర్పాటు చేసే లాంఛింగ్ సమస్యలు ఏవీ కవితకు వచ్చే అవకాశం లేదు. ఇలా తెలంగాణ జాగృతి సంస్థ కొత్త పార్టీ ఏర్పాటుకు లాంఛింగ్ పాడ్ లా ఉపయోగపడుతుంది. తెలంగాణలో ప్రజాకర్షణ గల మహిళా రాజకీయ నాయకుల కొరత ఉంది. మహిళా ఓటర్లను తమ వైపు తిప్పుకునే శక్తి ఉన్న మహిళా నేతలు తెలంగాణలో లేరనే చెప్పాలి. ఈ లోటును కవిత పూడ్చే అవకాశం ఉంది. మహిళలను ఆకట్టుకునే నాయకురాలిగా ఎదిగే అవకాశం ఉంది. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ జాగృతి సంస్థ, మహిళా రిజర్వేషన్లపై చేసిన కార్యక్రమాలు, కవితకు ఉన్న రాజకీయ అనుభవం కొత్త పార్టీ పెట్టేందుకు కలిసి రావచ్చు. ఉద్యమ నాయకురాలిగా, పార్లమెంట్ సభ్యురాలిగా, శాసనమండలి సభ్యురాలిగా ఉన్న అనుభవం పార్టీ నడపడంలో కొంత బలాన్ని ఇస్తుంది. అంతే కాకుండా కేసీఆర్ కూతరు కావడంతో తన తండ్రి పార్టీని నడిపిన తీరు, సంక్షోభ సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు వాటి వల్ల వచ్చిన విజయాలు, ఓటములు దగ్గర నుంచి చూసిన అనుభవం కూడా కలిసి వస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల పట్ల విముఖత ఉన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఓ కొత్త ప్రత్యామ్నాయాన్ని చూస్తుంటారు. అలాంటి సందర్భంలో కవిత పెట్టే పార్టీకి ఈ రాజకీయ పరిస్థితులు కొంత మేర కలిసి రావచ్చు. అలాంటి నేతలు కొత్త పార్టీలోకి వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి చేరికలు కొత్త పార్టీలో జోష్ నింపుతుందనడంలో సందేహం లేదు.

### బలహీనతలు ఏంటీ...

తెలంగాణలో ఇప్పటికే కేసీఆర్ కుటుంబపై ఉన్న ప్రధాన ఆరోపణ కుటుంబ రాజకీయాలు అనే ముద్ర. బీఆర్ఎస్ నుంచి వీడి కొత్త పార్టీ పెట్టినా కవితకు ఆ ముద్ర తప్పదు. అటు విపక్షాలు, ప్రజల నుంచి వచ్చే రాజకీయ విమర్శలు కొత్త పార్టీ పెట్టే విషయంలో ప్రతికూలం కావచ్చు. లిక్కర్ స్కాంలో ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలతో కవిత జైలుకు వెళ్లి రావడం ప్రధాన ప్రతికూలాంశంగా మారవచ్చు. అయితే కేసు నుంచి కవిత బయటపడే వరకు విపక్షాలు కవితను రాజకీయంగా వెనక్కు నెట్టే అస్త్రంగా లిక్కర్ స్కాం కేసును ఉపయోగిస్తాయనడంలో సందేహం లేదు. కొత్త పార్టీ పెట్టే వ్యక్తి రాజకీయ జీవితం మచ్చ లేనిదిగా ఉంటేనే పార్టీ నడపటం కష్టమైన ప్రస్తుత రాజకీయాల్లో లిక్కర్ స్కాంలో ఆరోపణలతో పార్టీని పెట్టి దాన్ని నడపడం కవితకు కత్తిమీద సామే అని చెప్పాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో కవిత కొత్త పార్టీ పెట్టేందుకు తెలంగాణలో రాజకీయ వాతావరణం అనుకూలంగా లేదనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలో ఉండటం, బీజేపీ క్రమ క్రమంగా తన బలాన్ని పెంచుకుంటూ ఉన్న తరుణం ఇది. బీఆర్ఎస్ పార్టీ కూడా భారీ బహిరంగ సభను వరంగల్ లో నిర్వహించి ప్రజాకర్షణ శక్తి ఏ మాత్రం తమ చీఫ్ కేసీఆర్‌కు తగ్గలేదని నిరూపించుకుంది. ఈ ఉత్సాహంతో ముందుకు సాగుతుంది ఇలాంటి రాజకీయ వాతావరణంలో కవిత కొత్త పార్టీ పెడితే ప్రజల నుంచి అనుకున్న రీతిలో మద్ధత్తు వస్తుందని ధీమాగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. కవిత కొత్త పార్టీ పెడితే బీఆర్ఎస్‌కు నష్టం కలిగించడమే ప్రధాన లక్ష్యం అవుతుంది. ఆ పార్టీ ఓటర్లలోనే ఎక్కువ చీలిక వస్తుందన్నది నిజం. ఆ పార్టీలోని అసంతృప్త నేతలు, కార్యకర్తలు, ఓటర్లు కొద్ది మంది కవిత వైపు తిరగవచ్చు. కాని ఇది బీఆర్ఎస్‌కు, అటు కవితకు లాభం చేకూర్చేది కాకుండా కాంగ్రెస్, బీజేపీలకు లాభించే అవకాశం ఉంది ఏ పార్టీ స్థాపించినా దానికో లక్ష్యం ఉంటుంది. అయితే తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటికే కాంగ్రెస్ , బీజేపీ, బీఆర్ఎస్, వామపక్షాల వంటి పార్టీలు ఓ బలమైన కారణాలతో పురుడు పోసుకున్నవి . పక్క రాష్ట్రంలో తీసుకున్నాటీడీపీ , వైసీపీ ఆవిర్భావం వెనుక బలమైన ప్రజా లక్ష్యాలు ఉన్నాయి. అయితే కవిత పెట్టే కొత్త పార్టీ తనకు అన్యాయం జరిగిందని చెబితే ప్రజలు ఆమోదం తెలిపే స్థితిలో లేరు. ఓ బలమైన ప్రజల ఆకాంక్షలను లక్ష్యంగా పెట్టుకొని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాంటి సెంటిమెంట్ ఉంటే తప్ప కొత్త పార్టీ నిలదొక్కుకునే పరిస్థితి ఉండదు. కొత్త రాజకీయ పార్టీ స్థాపన అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. నిధులు భారీగా అవసరం. కేసీఆర్ కుమార్తెగానో లేదా జాగృతి అధ్యక్షురాలిగానో నిధుల సేకరణ అంత సుళువుగా సాధ్యమయ్యే పని కాదు. కొత్త నాయకులను, కార్యకర్తలను తన వైపు తిప్పుకోవడం కూడా అంత ఈజీగా జరిగే పని కాదు.

మొత్తానికి అసంతృప్తితో ఉన్న కవిత కొత్త పార్టీ పెడుతారా లేకుంటే టీ కప్పులో తుపాను లా బీఆర్ఎస్ లో ఈ సంక్షోభం ముగియనుందా? అన్నది వేచి చూడాల్సిందే. అయితే కొత్త పార్టీ స్థాపనకుపై అంశాలు ప్రభావితం చూపే అవకాశం మాత్రం ఉన్నాయి. కవిత కొత్త పార్టీ పెట్టడం అనేది మాత్రం సాహసోపేతమైన చర్యగా చూడాల్సిందే. బీఆర్ఎస్‌లో డైనమిక్‌గానే కవిత వ్యవహార శైలి ఉంటుందని గులాబీ నేతలు చెబుతుంటారు. కేసీఆర్‌కు కవిత లేఖ రాయడం, ఆ లేఖ బహిర్గతం కాగానే సైలంట్‌గా ఉండకుండా తన లేఖను బయపెట్టింది కేసీఆర్ చుట్టు ఉన్న దయ్యాలే అని, కోవర్టులే అని మీడియా ముందుకు వచ్చి ధైర్యంగా మాట్లాడటం ఇవన్నీ కవిత ఓ కచ్చిత నిర్ణయానికి వచ్చి చేస్తున్న చర్యలుగానే చూడాల్సి వస్తుంది. పార్టీలో తన స్థానం ఏంటో తెలుసుకునేందుకు ఈ రీతిలో కవిత స్పందన ఉందన్నది బీఆర్ఎస్ కీలక నేతల మాట. ఇనాళ్లు పార్టీలో ఉండి పని చేసిన తన లాంటి నేతను పక్కన పెడితే చూస్తూ తాను ఊర్కునే రకం కాదన్న హెచ్చరిక గత రెండు మూడు రోజుల పరిణామాలు చెబుతున్నాయన్నది రాజకీయ విశ్లేషకుల మాట. అయితే కేసీఆర్ లాంటి లెంజడరీ నాయకుడ్ని, కేటీఆర్, హరీశ్ రావు లాంటి రాజకీయ చతురత ఉన్న నేతలను కాదని కవిత తన రాజకీయ భవిష్యత్తు కోసం పార్టీ పెట్టి వారికి ఎదురెళ్లుతుందా ? అంత సాహసం చేస్తుందా ? అన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో ఉంది.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143



## ఋతుశుభ్రత పాటిస్తే ఆనందం మన సొంతం





**వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 28:**
వరదయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్స వం సందర్భంగార్యాలీ నిర్వహించి అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమం వరదయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఉదయ్ కుమార్ డాక్టర్ ద్వైత గార్ల ఆధ్వ ర్యంలో నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా మహిళల్లో నెలసరి సమయంలో శారికంగానూ మానసికంగానూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వారు ఈ సమ స్యల్లో వారికి నచ్చిన పని చేయవచ్చని వారి దగ్గరికి తీసుకొని మానసిక దృడ త్వాన్ని పెంపొందించాలి, స్కూలుకి కాలే జీలకి వెళ్లాలా అక్కడ అందుబాటులో ఉండేలా శానిటరీ నాప్కిన్స్ ఐఎఫ్ఏ మాత్రలు తీసుకొని ఎలా ప్రోత్సహించడం జరుగుతుంది. పిరియడ్స్ అనేది సాధారణ శారీరిక ప్రక్రియని తెలియజేయడం జరిగినది విషయంలో పౌష్టిక ఆహారం తీసుకోవాలి ఎలాంటి అపోలో ఉండకూడదని తెలియజేయడం జరిగినది. పీరియడ్స్ సమయంలో ప్రతిరోజు స్నానం చేయాలి శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచు కోవాలి. శానిటరీ నాపకిన్స్ వాడాలని తెలియజేయడం, జరిగినది వాడు పడే సిన శానిటరీ నాప్కిన్స్ కాగితం చుట్టలు డస్ట్ బిన్లో పారవేయాలి. లేదా కాల్చివేయాలి ప్రతిసారి సబ్బుతో చేతులు పరి శుభ్రంగా కడుక్కోవాలి అని తెలియ జేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మధుసూదన్ శాంతి ఆరోగ్య కార్యదర్శులు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా

## చేపడుతున్న పండుగమహానాడు

**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 28:**
తెలుగు జాతికి అండ తెలుగుదేశం జెండా ప్రజల గుండెల నిండా పసు పు జెండా..





అంగరంగ వైభవంగా మహానాడు పండుగ. తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహిస్తున్న మహా నాడు కార్యక్ర మంలో పాల్గొన్న వరదయ్య పాలెం టిడిపి నాయకులు పన్నెం క్లస్టర్ ఇంచార్జ్ నిర్మల్ కుమార్, నాగరాజు, ఎక్స్ మండల పార్టీ ప్రెసిడెంట్ జై చందర్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, మరదవాడ సర్పంచ్ కుమార్, బాబు రెడ్డి, చిలమత్తూరు సర్పంచ్ కిషోర్, బత్తుల వల్లం ధరణి యాదవ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష రూపాయల్లో

# లక్షణమైన ఈవీ బైక్స్!

భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల రంగం రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. పెరుగుతున్న పెట్రోల్ ధరల దెబ్బకు సగటు సామాన్యుడు ఈవీ వాహనాల వినియోగానికి ముందుకు వస్తున్నాడు. అయితే ఈ ఈవీ వాహనాల్లో చాలా మంది ఈవీ స్కూటర్లనే కొనుగోలు చేస్తున్నారు. కానీ తాజాగా మార్కెట్‌లో ఈవీ బైక్‌లు సరసమైన ధరల్లో లాంచ్ కావడంతో వాటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఏప్రిల్ 2025లో రిటైల్ గణాంకాల ఆధారంగా 58 శాతం వాటాతో ఈవీ మార్కెట్‌లో ద్విచక్ర వాహనాలు హల్‌చల్ చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ప్రయాణికుల వాహనాలు, వాణిజ్య వాహనాలతో సహా మొత్తం ఈవీ విభాగం సంవత్సరానికి 17 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగం మొదటిసారిగా 1 మిలియన్ అమ్మకాలను సాధించింది. అలాగేసంవత్సరానికి 21 శాతం బలమైన వృద్ధిని చూసింది. ఈ విభాగంలో ఎలక్ట్రిక్ స్కూటర్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. కానీ మార్కెట్లో ఆల్-ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. రివోల్ట్ మోటార్స్ ఆర్‌వీ1 మోటర్ బైక్ ధర రూ. 90,000గా ఉంటుంది. రివోల్ట్ మోటార్స్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ విభాగంలో అగ్రగామిగా ఉంది. ఈ కంపెనీ ఐదు ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను అందిస్తుంది. రివోల్ట్ ఆర్‌వీ1, రివోల్ట్ ఆర్‌వీ1o, రివోల్ట్ బ్లేజ్‌ఎక్స్, రివోల్ట్ ఆర్‌వీ400 బీఆర్‌జెడ్, రివోల్ట్ ఆర్‌వీ400. రివోల్ట్ మోటార్స్ లైనప్‌లో అత్యంత సరసమైన వాహనం అయిన రివోల్ట్ ఆర్‌వీ1 నిలుస్తుంది. ఈ బైక్ 2.2 కేడబ్ల్యూహెచ్ లిథియం-అయాన్ బ్యాటరీ సామర్థ్యంతో 2.8 కేడబ్ల్యూహెచ్ మోటారును కలిగి ఉంది. ఆర్‌వీ 12 గంటల 15 నిమిషాల్లో 0-80 శాతం ఛార్జ్ అవుతుంది. అలాగే ఓ సారి చార్జ్ చేస్తే 100 కి.మీ.లేజ్ ఇస్తుంది. ఈ కంపెనీ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్, బ్యాటరీపై 5 సంవత్సరాలు లేదా 75,000 కి.మీ.ల వారంటీని అందిస్తోంది. అలాగే ఛార్జర్‌పై 2 సంవత్సరాల వారెంటీ



అందిస్తుంది. ఒబెన్ రోర్ ఈజెడ్ ఈవీ బైక్ ధర రూ. 90,000గా ఉంది. ఒబెన్ రోర్ ఈజెడ్ బైక్ 2.6 కేడబ్ల్యూహెచ్ 3.4 కేడబ్ల్యూహెచ్, 4.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్స్ వస్తుంది. 2.6 కేడబ్ల్యూహెచ్ మోడల్ ధర రూ. 90,000. ఈ బైక్ 52 శ్రీన్‌ఎం టార్క్ తో 7.5 కేడబ్ల్యూహెచ్ అవుట్‌పుట్‌తో వస్తుంది. ఈబైక్ 95 కిలోమీటర్ల వేగతంతో దూసుకుపోతుంది. కేవలం 3.3 సెకన్లలో 0 - 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఈ బైక్‌ను ఓ సారి చార్జ్ చేస్తే 110 కి.మీ పరిధిని అందిస్తుంది. ఈ బైక్‌ను 2 గంటల్లో 80 శాతం వరకు ఛార్జ్ అవుతుంది. ఈ బైక్‌కు 8 సంవత్సరాలు లేదా 80,000 కి.మీ క్లాస్-లీడింగ్ బ్యాటరీ వారంటీ ఉంది. ఓలా రోడ్‌స్టర్ ఎక్స్ ఈవీ బైక్ ధర రూ. 99,999గా ఉంది. ఈ బైక్ మూడు బ్యాటరీ ఎంపికలతో అందుబాటులో ఉంటుంది. 2.5 కేడబ్ల్యూహెచ్, 3.5 కేడబ్ల్యూహెచ్, 4.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఎంపికల్లో ఈ బైక్‌ను కొనుగోలు చేయవచ్చు. 2.5 కేడబ్ల్యూహెచ్ వెర్షన్ ఓ సారి చార్జ్ చేస్తే 140 కి.మీ మైలేజ్ అందిస్తుంది. అలాగే ఈ బైక్ 7 కేడబ్ల్యూ గరిష్ట శక్తిని అందుకుంటుంది. ఛార్జింగ్ విషయానికి వస్తే ఈ బైక్ 6.2 గంటల్లో 0 %-% 80 శాతం వరకు చార్జ్ అవుతుంది. ఈ బైక్ కేవలం 3.4 సెకన్లలో 0 %-% 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఓలా ఎలక్ట్రిక్ ఈ బైక్‌కు 3 సంవత్సరాలు లేదా 50,000 కి.మీ బ్యాటరీ వారంటీని అందిస్తోంది.

## 13 శాతం పెరిగిన ఎన్ఎండీసీ లాభం

ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి చక్కటి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.23,668 కోట్ల టర్నోవర్‌పై రూ.6,693 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే టర్నోవర్ 11 శాతం, నికర లాభం 13 శాతం పెరిగాయి. మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలోనూ కంపెనీ రూ.7,444 కోట్ల టర్నోవర్‌పై రూ.1,496 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే టర్నోవర్ ఎనిమిది శాతం పెరిగినా, నికర లాభం నామమాత్రంగా రెండు శాతం మాత్రమే పెరిగింది. అయినా 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు ఒక్కో షేరుపై రూపాయి చొప్పున తుది డివిడెండ్‌గా చెల్లించాలని ఎన్ఎండీసీ బోర్డు సిఫారసు చేసింది. ఇంతకు ముందు చెల్లించిన రూ.2.3 మధ్యంతర డివిడెండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ ఒక్కో షేరుపై రూ.3.3 చొప్పున డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై ఇది 330 శాతానికి సమానం.

## విండీస్‌తో తొలి వన్డే.. ఇంగ్లండ్ తుది జట్టు ప్రకటన..

# ఐపీఎల్ స్టార్లకు చోటు

భారతకాలమానం ప్రకారం రేపు (మే 29) సాయంత్రం 5:30 గంటలకు వెస్టిండీస్‌తో జరుగబోయే తొలి వన్డే కోసం ఇంగ్లండ్ తుది జట్టును ఇవాళ ?ప్రకటించారు. ఈ జట్టులో ఐపీఎల్-2025 స్టార్ త్రయం జోస్ బట్లర్ (గుజరాత్ టైటాన్స్), విల్ జాక్స్ (ముంబై ఇండియన్స్), జేకబ్ బేతెల్‌కు (ఆర్సీబీ) చోటు దక్కింది. వీరితో పాటు సీఎస్‌కే బౌలర్ జేమీ ఓవర్టన్ కూడా తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ సిరీస్‌లో ఇంగ్లిష్ జట్టుకు హ్యారీ బ్రూక్ నాయకత్వం వహిస్తున్నాడు. బట్లర్, బేతెల్, జాక్స్ ఐపీఎల్‌లో తమ జట్లు ప్లే ఆఫ్స్ ఆడాల్సి ఉన్నా లీగ్ మ్యాచ్‌లు పూర్తి కాగానే జాతీయ విధులకు హాజరయ్యారు. ఈ ముగ్గురు లీగ్ దశలో తమతమ జట్ల తరఫున అత్యుత్తమ ?ప్రదర్శనలు చేశారు. రేపు విండీస్‌తో జరుగబోయే మ్యాచ్‌లో జేమీ స్మిత్, బెన్ డకెట్ ఓపెనింగ్ చేస్తారు. వెటరన్ ఆటగాడు మూడో స్థానంలో, కెప్టెన్ బ్రూక్ నాలుగో స్థానంలో, బట్లర్, బేతెల్, జాక్స్, ఓవర్టన్ వరుసగా ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది స్థానాల్లో బరిలోకి దిగుతారు. గాయం కారణంగా ఐపీఎల్ ప్రారంభానికి ముందే వైదొలిగిన బ్రైడన్ కార్స్ కూడా ఈ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిథ్యం వహించిన జోఫ్రా ఆర్చర్ కూడా తొలుత ఈ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆర్చర్ ఐపీఎల్




సందర్భంగా గాయపడటంతో అతని స్థానంలో సాకిబ్ మహమూద్‌ను ఎంపిక చేసుకుంది ఇంగ్లిష్ మేనేజ్‌మెంట్. రేపటి మ్యాచ్‌కు అతను కూడా తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. మొత్తంగా చూస్తే, రేపు విండీస్‌తో తలపడబోయే ఇంగ్లిష్ జట్టు ఐపీఎల్ దూప్ జట్టుగా కనిపిస్తుంది.

**విండీస్‌తో తొలి వన్డే కోసం ఇంగ్లండ్ తుది జట్టు..**
బెన్ డకెట్, జేమీ స్మిత్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), జేకబ్ బేతెల్, విల్ జాక్స్, జేమీ ఓవర్టన్, బ్రైడాన్ కార్స్, సాకిబ్ మహమూద్, ఆదిల్ రషీద్. ఇదిలా ఉంటే, రేపటి మ్యాచ్ కోసం? విండీస్ తుది జట్టును ప్రకటించాల్సి ఉంది. మూడు వన్డేలు, మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం విండీస్ జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో తొలుత వన్డే సిరీస్, ఆతర్వాత టీ20 సిరీస్ జరుగుతాయి. మే 29, జూన్ 3 తేదీల్లో వన్డేలు.. 6, 8, 10 తేదీల్లో టీ20లు జరుగనున్నాయి.

**పూర్తి జట్లు..**
వెస్టిండీస్: బ్రాండన్ కింగ్, ఎవిన్ లూయిస్, కీసీ కార్టీ, షాయ్ హోప్(%ఒ/ఎ%), అమీర్ జాంగూ, జస్టిన్ గ్రీవ్స్, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, అల్జారి జోసెఫ్, గుడకేష్ మోటీ, షమర్ జోసెఫ్, జెడియా బ్లేడ్స్, జ్యువెల్ ఆండ్రూ, జేడెన్ సీల్స్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెపర్డ్, షిమ్రాన్ హెట్‌మైర్
ఇంగ్లం?డ్: బెన్ డకెట్, జేమీ స్మిత్, జో రూట్, హ్యారీ బ్రూక్, జోస్ బట్లర్, జాకబ్ బెథెల్, విల్ జాక్స్, జేమీ ఓవర్టన్, బ్రైడాన్ కార్స్, ఆదిల్ రషీద్, సాకిబ్ మహమూద్, ల్యూక్ వుడ్, టామ్ బాంటన్, మాథ్యూ పాట్స్, టామ్ హార్ట్లీ

## మరోసారి తండ్రైన టీమిండియా క్రికెటర్

టీమిండియా క్రికెటర్ జయదేవ్ ఉనద్కత్ మరోసారి తండ్రి అయ్యాడు. అతని భార్య రిన్నీ కంతారియా ఈ నెల 18న మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని ఉనద్కత్ ఇవాళ (మే 28) సాయంత్రం సోషల్‌మీడియా వేదికగా వెల్లడించాడు. ఉనద్కత్, రిన్నీ 2021లో పెళ్లి చేసుకున్నారు. వీరికి 2023 డిసెంబర్‌లో జేడన్ (మగబిడ్డ) జన్మించాడు. 33 ఏళ్ల ఉనద్కత్ ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడాడు. ఈ సీజన్‌లో అతను 7 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీశాడు. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ లీగ్ దశలోనే నిష్క్రమించింది. ఉనద్కత్ రంజీల్లో సౌరాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తాడు. ఆ జట్టుకు అతను కెప్టెన్‌గానూ వ్యవహరిస్తున్నాడు. అతని సారథ్యంలో సౌరాష్ట్ర 2020లో రంజీ ట్రోఫీ గెలిచింది. ఇది ఆ జట్టుకు తొలి టైటిల్. 2010లో టీమిండియా అరంగేట్రం చేసిన ఉనద్కత్.. మధ్యలో చాలాకాలం జట్టులో స్థానం దక్కించుకోలేకపోయాడు. 15 ఏళ్లలో అతను టీమిండియా తరఫున 4 టెస్ట్‌లు, 8 వన్డేలు, 10 టీ20లు మాత్రమే ఆడాడు. ఇందులో 26 వికెట్లు తీశాడు. ఐపీఎల్‌లో ఉనద్కత్‌కు మంచి




ట్రాక్ రికార్డు ఉంది. క్యాష్ రిచ్ లీగ్‌లోనూ 2010లోనే కెరీర్ ప్రారంభించిన ఉనద్కత్.. ఇప్పటివరకు వివిధ ఫ్రాంచైజీల తరఫున 112 మ్యాచ్‌లు ఆడి 110 వికెట్లు తీశాడు.

## స్పోర్ట్స్

### 9 ఏళ్ల తర్వాత టాప్-2లోకి..
### ప్లే ఆఫ్స్‌లో బెంగళూరు రికార్డు ఎలా ఉందంటే?

ప్రతి ఐపీఎల్ సీజన్ ఆరంభంలో ఆర్సీబీ అభిమానుల నోటి నుంచి ఎక్కువగా వినిపించే మాట.. 'ఈసాలా కప్ నమదే' (ఈసారి కప్ మనదే). ఈ సారి ఆ కల నెరవేరే అవకాశముంది. ఐపీఎల్ 2025కు ముందు జట్టులో భారీ మార్పులు చేసిన ఆర్సీబీ అన్ని




విభాగాల్లో దుర్భేద్యంగా తయారైంది. లీగ్ ఆరంభం నుంచే మేటి జట్లకు షాకిస్తూ వరుసగా విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిచింది. తొమ్మిదేళ్ల తర్వాత బెంగళూరు క్వాలిఫయర్-1కు అర్హత సాధించడం విశేషం. మునుపెన్నడూ లేనంత విధంగా బలంగా కనిపిస్తోన్న బెంగళూరు ఈ సారి టైటిల్ కరవును తీర్చుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఫైనల్ చేరడానికి రెండు అవకాశాలుండటం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం. మరి ఇప్పటివరకు ఆర్సీబీ ఎన్నిసార్లు ప్లే ఆఫ్స్ చేరింది, ఎలాంటి ప్రదర్శన చేసిందో ఓ లుక్కేద్దాం.

**మూడేళ్లలో రెండుసార్లు మిస్**
తొలి నాలుగు సీజన్లలో మూడు సార్లు ప్లేఆఫ్‌కు చేరిన ఆర్సీబీ.. మూడేళ్ల వ్యవధిలో రెండుసార్లు త్రుటిలో టైటిల్‌ను చేజార్చుకుంది. అప్పట్లో చెన్నై తర్వాత అత్యంత విజయమైన జట్టు బెంగళూరే. తొలి సీజన్‌లో ఏడో స్థానంలో నిలిచిన ఆ జట్టు తర్వాతి సీజన్ (2009)లో అద్భుత ప్రదర్శన చేస్తూ ఫైనల్‌కు చేరింది. సెమీ ఫైనల్‌లో చెన్నైని ఆరు వికెట్ల తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. కానీ, టైటిల్ పోరులో హైదరాబాద్ చేతిలో 6 పరుగుల తేడాతో ఓటమిపాలై కప్‌ను అందుకోలేకపోయింది. అనంతరం మూడో సీజన్ (2010)లోనూ మెరుగైన ప్రదర్శనతో సెమీస్‌కు చేరింది. అయితే ముంబయి చేతిలో 35 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసి టోర్నీ నుంచి వైదొలిగింది. 2011లో బెంగళూరు జూలు విదిలించింది. గేల్ విధ్వంసంతో వరుసగా ఏడు విజయాలు సాధించింది. 19 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ప్లేఆఫ్‌కు చేరింది. అయితే క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో చెన్నై చేతిలో ఆరు వికెట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. అనంతరం ముంబయితో జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో అదరగొట్టింది. 43 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. కానీ, చెన్నై చేతిలో బెంగళూరుకు మరోసారి భంగపాటు తప్పలేదు. తుది పోరులో 58 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసి టైటిల్‌ను మరోసారి కోల్పోయింది. 2012, 2013, 2014 సీజన్లలో బెంగళూరు లీగ్ దశను దాటలేకపోయింది. కానీ, 2015లో మూడో స్థానంలో నిలిచి ప్లేఆఫ్‌కు చేరింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. కానీ, చెన్నైతో జరిగిన క్వాలిఫయర్-2లో ఆర్సీబీకి చుక్కెదురైంది.